పది పరీక్షలకు సన్నద్ధం



టెన్త్ విద్యార్థినులకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్న గుడ్లవల్లేరు ఎంఈఓ-2 గోపాలరావు

గుడ్లవల్లేరు: పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించేందుకు విద్యార్థులు ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలంటే సహజంగా విద్యార్థుల్లో భయం ఉంటుంది. ఆ భయం లేకుండా ఉండేందుకు విద్యార్థులకు ఉపాధ్యాయులు ఇచ్చే మార్గదర్శకాలు ఉన్నాయి. వచ్చే నెల 17 నుంచి 31వ తేదీవరకు టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. గుడ్లవల్లేరు మండలంలో 435 మంది టెన్త్ విద్యార్థులు వార్షిక పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ఉన్నత పాఠశాలల్లో టెన్త్ పిల్లలకు డీ-గ్రేడ్ వచ్చిందంటే చాలు తామున్నామంటూ వారిలో ఉత్తీర్ణత పెంచేందుకు ఉపాధ్యాయులు ముందంజలో ఉంటున్నారు. కంటికి రెప్పలా కాపాడుకుంటూ పరీక్షల్లో పాసయ్యేంతవరకూ వదిలిపెట్టకుండా పాఠాలను సులభంగా అర్థమయ్యే రీతిలో బోధిస్తున్నారు.

పక్కాగా స్టడీ అవర్స్



గుడ్లవల్లేరు మండలంలో వంద శాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులంతా సమష్టిగా కృషి చేస్తున్నారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.45 నుంచి 5.45గంటల వరకు పక్కాగా స్టడీ అవర్స్ జరుపుతున్నాం. పబ్లిక్ ఎగ్జామ్స్ కోసం ముందు నుంచే క్వార్టర్లీ, ఆరు నెలల పరీక్షల్లో వచ్చిన ప్రశ్నలు, జవాబులపై ముఖ్యమైన వాటిని విద్యార్థులకు తెలియజేశాం. ముందు నుంచే మా టెన్త్ పిల్లలు ఏ రోజూ పాఠశాలకు గైర్హాజరు కాకుండా చూసుకుంటున్నాం.

– జగన్మోహనరావు, గుడ్లవల్లేరు ఎంఈఓ-1

పట్టుదలతో చదవాలి



సినిమా, కేబుల్ టీవీ, క్రికెట్, సెల్‌ఫోన్, చార్టింగ్‌కు దూరంగా ఉంటే పిల్లలకు 70 శాతం సమయం కలిసొస్తుందని శిక్షణ ఇస్తున్నాం. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి 9లోపు గణితం, సైన్సు, సోషల్ ఇంగ్లిష్ సబ్జెక్టులు చదువుకోవాలి. తేలికగా జీర్ణమయ్యే విధంగా భోజనంలోకి పప్పు, ఆకు కూరలు, మజ్జిగను వాడాలి. నిద్ర, నిత్యకృత్యాలకు మినహాయించి ఉన్న తక్కువ సమయంలో క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలి. ప్రశాంతమైన స్థలాన్ని చదువుకునేందుకు ఇంటి వద్ద ఎన్నుకోవాలి. పరీక్షలకు అవసరమైన పుస్తకాలను చేతికి అందుబాటులో ఉంచుకోవటం ముఖ్యం.

– శ్రీనివాసమూర్తి, ఏఏఎస్‌ఎం అండ్ వీవీఆర్‌ఎస్‌ఆర్ హైస్కూల్ డైరెక్టర్, గుడ్లవల్లేరు

పాజిటివ్‌గా ఆలోచించాలి



పరీక్షల సమయంలో పాజిటివ్‌గా ఆలోచనలు ఉండాలి. పరీక్ష పేపర్ ఇచ్చిన వెంటనే జవాబులు రాయటం ప్రారంభించకూడదు. తొలిగా పేపర్‌ను క్షుణ్ణంగా చదవాలి. బాగా వచ్చిన ప్రశ్నలకే జవాబులు రాయాలి. అపుడు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. దాంతో మిగిలిన ప్రశ్నలకు వాటంతట అవే గుర్తుకు వచ్చి, పరీక్షలు విజయవంతంగా రాయగలుగుతారు. రాసిన ప్రతి జవాబును ఒక నిమిషం పాటు సరిచూసుకోవాలి.

– శింగంశెట్టి ఆదినారాయణ, శ్రీ సాయి విద్యానికేతన్ అధినేత, గుడ్లవల్లేరు

మటన్, చేపలు కొనేందుకు మొగ్గు



మటన్ కొనుగోలు చేస్తున్న మాంస ప్రియులు

గుడ్లవల్లేరు: మాంసాహార ప్రియులు ఆదివారం మటన్, చేపలు కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపారు. బర్డ్‌ఫ్లూ పుణ్యమా అంటూ చికెన్‌పై చిన్నచూపు చూస్తున్నారు. కనీసం చికెన్ చూద్దామన్నా మార్కెట్లో పెద్దగా కనబడటం లేదు. అక్కడక్కడా మార్కెట్లో రెండు కోళ్లు కట్టినా వినియోగదారులు ఎవరూ అటువైపు వెళ్లలేదు. దీంతో అమ్మకందారులు ఉసూరుమంటున్నారు. చికెన్‌ను ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో సాయంత్రం వరకు అలాగే కట్టిన చోట కట్టినట్లే కోళ్లు వేలాడుతున్నాయి. కిలో రూ.220నుంచి రూ.140వరకూ చికెన్ ధర తగ్గించినా కొనేందుకు ముందుకు వచ్చే నాథుడే లేడు. కిలో మటన్ రూ.800 ఉన్నా దాన్ని తినేందుకే వినియోగదారులు ఇష్టపడుతున్నారు. 18 రోజులుగా చికెన్ అమ్మకాలు తగ్గాయి. చికెన్ తినవచ్చని అధికారులు చెప్పినా చికెన్ ప్రియులు దానిన కొనేందుకు సాహసం చేయటం లేదు. ఫ్లూ భయం వెంటాడటంతో చికెన్ అమ్మకాల కంటే మటన్ విక్రయాలే అధికమయ్యాయి. అలాగే చేపలు, రొయ్యలు, పీతలకు కూడా డిమాండ్ పెరిగింది. కిలో చేపలు రూ.200 నుంచి వాటి జాతులను బట్టి అమ్ముతున్నారు. పీతలు కిలో రూ.250నుంచి సైజులను బట్టి విక్రయిస్తున్నారు. అలాగే రొయ్యలను కౌంట్‌ను బట్టి కిలో రూ.200 నుంచి రూ.1,000 వరకు ఉన్నా నాన్ వెజ్ ప్రియులు కొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న చేపలు

వరుస దొంగతనాలతో ప్రజల బెంబేలు



నెమ్మలూరులో వివరాలను సేకరిస్తున్న సీఐ, ఎస్‌ఐ

నెమ్మలూరు(పామర్రు): మండలంలోని పలు గ్రామాల్లో వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ విషయమై పామర్రు పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు మండలంలోని పెదమద్దాలి శివారు ప్రాంతం కొండాయపాలెంలో మాధవీలత నివాసంలో శనివారం రాత్రి దుండగులు ప్రవేశించి బీరువాను బద్దలుకొట్టి దానిలో ఉన్న నాలుగు చిన్న ఉంగరాలు, వెండి గ్లాసు, రూ.1,000ను అపహరించారు. తర్వాత అదే గ్రామంలోని మండా వెంకటేశ్వరరావు ఇంట్లో కూడా ఎవరూలేక పోవడంతో ఆ ఇంట్లో దుండగులు ప్రవేశించి దొంగతనం చేశారు. అనంతరం మండలంలోని నెమ్మలూరు శివారు ప్రాంతమైన మలయప్పన్న పేటలోని సాలి రాణి ఇంట్లో నిద్ర పోతున్న సమయంలో దుండగులు ఇంట్లో ప్రవేశించి రాణి బ్యాగ్‌లో ఉన్న 16 కాసుల బంగార వస్తువులను అపహరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ సుభాకర్, ఎస్‌ఐ రాజేంద్ర ప్రసాద్‌లు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

శివరాత్రికి ఆలయాల ముస్తాబు



పామర్రులో ముస్తాబవుతున్న సోమేశ్వరస్వామి ఆలయం

పామర్రు: ఈ నెల 26న శివరాత్రిని పురస్కరించుకుని పలు శైవాలయాల్లో శివ పార్వతుల కల్యాణోత్సవం నిర్వహించేందుకు ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. స్థానిక సోమేశ్వరస్వామి ఆలయానికి రంగులు అద్ది సుందరంగా అలంకరించినట్లు ఆలయ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక అంకమ్మతల్లి ఆలయంలో ఏర్పాటు చేసిన శివలింగానికి అభిషేకాలను నిర్వహించి ఆ రోజు సాయింత్రం కల్యాణోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు వరదా అప్పారావు తెలిపారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు



తోట్లవల్లూరులో ఇంటి పన్ను వసూళ్లను పరిశీలిస్తున్న డీపీఓ అరుణ

తోట్లవల్లూరు: చెత్త సేకరణను పూర్తి స్థాయిలో నిర్వహించటం ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి జే అరుణ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. తోట్లవల్లూరులో ఆమె ఆదివారం పర్యటించారు. శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఐలూరు వద్ద కృష్ణానదిలో జరుగుతున్న జల్లు స్నానాల ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. రొయ్యూరు, తోట్లవల్లూరు గ్రామాల్లో శానిటేషన్‌ను అరుణ పరిశీలించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కృష్ణా కరకట్టపై ఎక్కడ చూసినా చెత్త, వ్యర్థాలు ఉన్నాయని, వాటిని తొలగింపునకు వెంటనే చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. చెత్త సేకరణపై దృష్టి సారించాలన్నారు. అలాగే ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. మండలంలో ఇంటి పన్ను వసూళ్లు కేవలం 38 శాతం మాత్రమే జరిగాయని, ఈ నెలాఖరుకు 75 శాతం వరకు నిర్వహించాలని సూచించారు. డీఎల్‌పీఓ కార్యాలయ ఏఓ రాజాబాబు, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

పగలు కూడా వీధి దీపాలు



గుడివాడ టౌన్: గుడివాడ పురపాలక సంఘంలో వీధి దీపాలు పట్టపగలు కూడా వెలుగుతున్నాయి. ఆదివారం ఉదయం 8 గంటలకు కూడా వీధి దీపాలు ఆర్పకపోవడం విమర్శలు వెల్లువెత్తాయి. ప్రధాన రహదారుల్లో వీధిలైట్లు సకాలంలో ఆర్పక పోవడాన్ని స్థానికులు తప్పుపడుతున్నారు.

ఘనంగా గంగానమ్మ ఆలయ జీర్ణోద్ధరణ



అమ్మవారికి ప్రత్యేక పూజలు

గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ గంగానమ్మ తల్లి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని ఆదివారం వేద పండితులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో వివిధ హోమాలతో పాటు విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలను వేద పండితులు చేపట్టారు. ఈ ఆలయాన్ని గ్రామస్తుల సంయుక్త సహకారంతో జీర్ణోద్ధరణ చేశారు. అమ్మవారిని భక్తులందరూ దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్‌ఈఆర్‌ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాపయ్యచౌదరి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రవి కుమార్, మాజీ లయన్స్ చైర్మన్ పోలవరపు వెంకట్రావు, సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా వెంకటేశ్వరుని కల్యాణం



కుముదలవాడలో కల్యాణోత్సవం



వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామి కల్యాణాన్ని మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు కనులపండువగా నిర్వహించారు. అధికసంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

నందివాడలో..

నందివాడ: నందివాడ మండలం తమిరిశ గ్రామం కుముదలవాడలోని శ్రీ సంతాన నాగేంద్ర స్వామి ఆలయంలో శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్య సమేత స్వామి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అనంతరం గుత్తా త్రివిక్రమరావు ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

కోటయ్యకు డీన్నార్ పరామర్శ



సుబ్బమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు జంపన కోటయ్యను ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పరామర్శించారు. కోటయ్య తల్లి సుబ్బమ్మ ఇటీవలే మృతి చెందగా ఆదివారం జరిగిన కార్యక్రమానికి డీఎన్నార్, నాయకులు హాజరై సంతాపం తెలిపి సుబ్బమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మోట్రు ఏసుబాబు, నాయకులు కోటేశ్వరరావు, కిషోర్, సాక్షి సాయిబాబు, కుమార్, రామకృష్ణ, వసంతరావు, సుబ్బారావు, చంటి పాల్గొన్నారు.

27న సామూహిక ధ్యానం

గుడివాడ టౌన్: స్థానిక తట్టివర్రు రోడ్‌లోని శ్రీ రమణ మహర్షి పిరమిడ్ ధ్యానకేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ సామూహిక ధ్యానం నిర్వహించనున్నట్లు ధ్యానకేంద్రం నిర్వాహకురాలు రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శ్రీలంకకు చెందిన తెలుగు బౌద్ధ భిక్షువు బోధిహిన్ ఈ ధ్యానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 99895 59581లో సంప్రదించాలని కోరారు.

డాక్టర్ కృష్ణదొరకు సత్కారం



గుడివాడ టౌన్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంస్థ కార్యాలయంలో ఉత్తమ సేవలందిస్తున్న డాక్టర్ కృష్ణదొరను ఆదివారం సత్కరించారు. నారాయణరావు అనే వెల్డింగ్ కార్మికుడు గాయలపాలు కాగా అతడికి రూ. 5 వేలు వితరణ అందజేశారు. సేవాసంస్థ జిల్లా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి, గుడివాడ అధ్యక్షుడు ఎ.గోపిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ దండమూడి తదితరులు పాల్గొన్నారు.

మినుము నూర్పిళ్లు ప్రారంభం



పామర్రు: మండలంలో పలుచోట్ల మినుము నూర్పిళ్ల పనులను ప్రారంభించారు. మినుము పంట ఆశాజనకంగా ఉందని, ఎకరానికి 6-8 బస్తాల వరకు దిగుబడి వచ్చే అవకాశాలున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంతో లాభాలు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

క్లుప్తంగా

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తుల తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. ఈ వారం ఎక్కువగా నూతన వధూవరుల జంటలు అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లు చేశారు.

దొంగ నోటు కలకలం



తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో దొంగ నోటు కలకలం సృష్టించింది. రూ.500 నకిలీ నోటు రావటంతో ఓ టీ స్టాల్ యజమాని కలవరపాటుకు గురయ్యాడు. గ్రామంలోని ఓ టీ స్టాల్‌లో శనివారం సాయంత్రం టీ తాగిన ఓ అపరిచిత వ్యక్తి రూ.500 నోటును మార్పిడి చేశాడు. టీ స్టాల్ వద్ద జనం హడావుడి ఎక్కువగా ఉండటంతో షాపులో పని చేసే వ్యక్తి దానిని సరిగా పరిశీలించకుండా తీసుకుని చిల్లర ఇచ్చాడు. రాత్రికి నగదు లెక్కించే సమయంలో అనుమానం రావటంతో రూ.500 నోటును పరిశీలించగా, అది నకిలీదిగా తేలింది. దీంతో గ్రామంలోని వివిధ రకాల వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

పెరికెగూడెంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్

మండవల్లి: పెరికెగూడెం శివారు కొత్తూరులో ఆదివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తను వేరుచేసి తరలించారు. సర్పంచ్ పెరుమాళ్ల పద్మ, కార్యదర్శి ఎస్‌వీ రాధిక, వైస్ సర్పంచ్ టి నాగబాబు, పంచాయతీ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నమల్లికార్జునస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



తోట్లవల్లూరు: స్థాస్థానిక శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి దివ్య లీలా కల్యాణోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల తొలిరోజు ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు జరిపి స్వామిని పెండ్లి కుమారుడిని, అమ్మవారిని పెండ్లి కుమార్తెను చేశారు. రాత్రికి స్వామిని భృంగి వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. శివలెంక గౌరీశంకర్, అర్చకులు నాగశర్మ, బాలాజీ, ఆలయ ఈఓ హరి దుర్గా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే ఫ్లై ఓవర్ పనుల్లో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి కోసం సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ జీబీ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత



మండవల్లి: మండవల్లి చెందిన అర్జా శ్రీను, నూనె సీతమ్మకు ఆదివారం నిత్యావసర సరుకులను మానవతా స్వచ్ఛంద సంస్థ ద్వారా అందజేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో మండల మానవతా అధ్యక్షుడు గుడివాడ గణేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ సుధాబత్తుల విజయ్‌కుమార్, నీటిసంఘం అధ్యక్షుడు బొల్లెంపల్లి కృష్ణారావు, మానవతా సంస్థ ప్రదాన కార్యదర్శి ఏసుబాబు పాల్గొన్నారు.

సబ్ జోన్ ఆటల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కైకలూరు: సబ్ జోన్ ఆటల పోటీల్లో కైకలూరు నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 12 పతకాలను సాధించి అందరి మన్ననలు పొందారు. ఈ నెల 21, 22 తేదీల్లో ముదినేపల్లి, ఆరుతెగలపాడు హైస్కూల్స్‌లో పోటీలను నిర్వహించారు. కై కలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల జట్టు వాలీబాల్‌లో మొదటి స్థానం, కోకోలో రెండో స్థానం సాధించింది. వ్యక్తిగతంగా పాఠశాలకు చెందిన హేమప్రియ (600 మీటర్లు, ప్రథమ), పూజిత(400 మీటర్లు, తృతీయ), భవానీ(200 మీటర్లు, తృతీయ), ప్రణవి(100 మీటర్లు, తృతీయ), పూజిత(లాంగ్ జంప్, తృతీయ), బాలురు విభాగంలో పాండు(100 మీటర్లు, ప్రథమ), శ్యామ్(200 మీటర్లు, ప్రథమ), కిరణ్(400 మీటర్లు, ప్రథమ), డేవిడ్(600 మీటర్లు, ప్రథమ), చరణ్ తేజ(షార్ట్‌పుట్, ద్వితీయం) సత్తా చాటారు.


సంక్షిప్త వార్తలు

■ **పత్రికా ప్రమాణాలు పెరిగేందుకు దోహదపడాలి**



కూచిపూడి(మొవ్వ): పత్రికా ప్రమాణాలు పెరిగేందుకు సంఘాలు దోహదం చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ యూనియన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం కూచిపూడిలోని ఎస్‌ఎస్‌ఎల్ కన్వెన్షన్ సెంటర్లో అఖిల భారత వార్తాపత్రిక ఉద్యోగుల సమాఖ్య కేంద్ర కార్యవర్గ సమావేశాలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ యూనియన్ ఫర్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్స్ ప్రధాన కార్యదర్శి చలాది పూర్ణచంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో గ్రామ సర్పంచ్ వెంకటరమణ విజయలక్ష్మి పాల్గొన్నారు.

■ **ఎక్కడి చెత్త అక్కడే**



రోడ్లపై వదిలివేసిన చెత్త

గుడివాడ టౌన్: పురపాలక సంఘ పరిధిలో పారిశుద్ధ్య కార్మికుల కొరత కారణంగా కొన్ని ప్రాంతాల్లో ఎక్కడ చెత్త అక్కడ పేరుకుపోతుంది. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న వీధిలో గుల్జార్‌చౌక్ మసీదు సమీపంలో హోల్‌సేల్ వ్యాపారులు అధికంగా ఉంటారు. ఈ సముదాయాల మధ్యగల రోడ్డుపై పారిశుద్ధ్య కార్మికులు చెత్తను వేసి, ఎత్తకుండా వదిలేశారు.

■ **అన్నసమారాధన**

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు స్వామిని దర్శించుకుని తమ మొక్కులను చెల్లించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధా రెడ్డి ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు.


■ **విశిష్ట గుర్తింపు సంఖ్యతో ప్రయోజనం**

పమిడిముక్కల: రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయశాఖ గన్నవరం ఏడీఏ ఎం.సునీల్ అన్నారు. మండలంలోని మేడూరు, కపిలేశ్వరపురం తదితర గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంలో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియను ఆదివారం పరిశీలించారు. ఏఓ ఎస్.గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

■ **పోటెత్తిన భక్తులు**

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద ఏర్పాట్లు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్ గంగా శ్రీదేవి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

■ **సహజ కవి బెనర్జీ మాస్టార్‌కు సన్మానం**



సన్మానం అందుకుంటున్న బెనర్జీ

కైకలూరు: సహజ కవిగా గుర్తింపు పొందిన కైకలూరు ఓరియంటల్ స్కూల్ ఉపాధ్యాయుడు దండే బెనర్జీకి భద్రాచలంలో ఆదివారం సన్మానం జరిగింది. శ్రీ శ్రీ కళావేదిక 144 జాతీయ శతాధిక కవి సమ్మేళనం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో భద్రాచలం పాల్ రాజ్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియం ఎటపాకనందు సాహితీవేత్తల సమ్మేళనం జరిగింది. ఈ వేదికపై బెనర్జీ మహిళలపై కవితా గానం చేసి ఆహూతుల ప్రశంసలందుకున్నారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సీఈఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ చేత ఘన సన్మానం పొందారు.

■ **ఆత్మవిశ్వాసమే విజయానికి నాంది**

ముదినేపల్లి రూరల్: ఆత్మవిశ్వాసమే విజయానికి నాంది అని కోరుకొల్లు హైస్కూల్ ఉపాధ్యాయుడు పి.కుమారస్వామి అన్నారు. వడాలి జెడ్పీహైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు ఆదివారం ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ రాబోయే పదో తరగతి పరీక్షలను ఎలాంటి భయం లేకుండా ఉత్సాహంగా ఎదుర్కోవాలని విద్యార్థులకు సూచించారు. హెచ్‌ఎం విజయకుమార్, సీనియర్ ఉపాధ్యాయుడు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.